క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

దౌల్తాబాద్: మండల పరిధిలోని యాంకి గ్రామానికి చెందిన పకీరప్ప అనారోగ్యంతో పది రోజుల క్రితం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 2002–03 పదోతరగతి మిత్ర బృందం ఆయన కుటుంబ సభ్యులకు శనివారం రూ.55వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఆ ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలి

బీజేపీ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: పట్టణంలోని ఓ పాఠశాలలో చదువుతున్న బాలికను వేధించిన ఉపాధ్యాయునిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం డిమాండ్ చేశారు. శనివారం పలువురు నాయకులు పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. కొన్ని రోజుల క్రితం ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినిని వేధించిన విషయం విధితమే. గురువు స్థానంలో ఉండి తప్పు చేసిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయకపోవడాన్ని తప్పుబట్టారు. వెంటనే సదరు ఉపాధ్యాయునిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాహు శ్రీలత, జహీర్ అబ్బాస్, కృష్ణ, కిరణ్, ప్రహ్లాద్, శ్రీనివాస్, రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

ఏఈఓ శ్రీనివాస్



ఎన్కేపల్లిలో పంట నమోదులో ఏఈఓ శ్రీనివాస్ తదితరులు

మోమిన్‌పేట: ప్రతీ రైతు తాను సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవాలని ఏఈఓ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎన్కేపల్లిలో పంటల నమోదు కర్యాక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తాము సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పంటలను ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించాలంటే నమోదు తప్పనిసరి అని చెప్పారు. సర్వే నంబర్ల వారీగా ఎంత విస్తీర్ణం.. ఏఏ పంటలు సాగు చేశారో ఆన్‌లైన్ నమోదు చేయించుకోవాలని తెలిపారు.

వరదకు దెబ్బతిన్న రోడ్డు, కాల్వ

మరమ్మతులు చేయించాలని వినతి



ధారూరు: మండల పరిధిలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నీటి కాల్వ ఇటీవల కురిసిన భారీ వర్షానికి పాడైంది. కాల్వ పక్క నుంచి వెళుతున్న ప్రధాన రోడ్డు కూడా కోతకు గురై గుంతలుగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని మాజీ వైస్ ఎంపీపీ వరద మల్లికార్జున్ ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దేముల్, కోట్‌పల్లి, బంట్వారం, ధారూరు నుంచి వస్తున్న వాహనాలు గుంతలో పడే ప్రమాదం లేకపోలేదు. వెంటనే మరమ్మతులు చేయించాలని ఆయన కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్

శంకర్‌పల్లి: రేబిస్ ఫ్రీ తెలంగాణకు అందరం కలిసికట్టుగా పనిచేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ యోగేశ్ అన్నారు. శనివారం బ్లూ క్రాస్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పట్టణంలో మాస్ యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించగా... కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 15 పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్, 24 వీధి కుక్కలను స్టెరిలైజేషన్ కోసం తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రేబిస్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకురావాలని, ఇంట్లో, వీధుల్లో కుక్కలకు సంబంధించి సమాచారాన్ని తెలియజేయాలన్నారు.



కొడంగల్ రూరల్: జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల ఆవరణలో ఎంఈఓ రాంరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు



కుల్కచర్ల: గండిచెరువు తండా ప్రాథమిక పాఠశాలలో సంబరాలు



దుద్యాల్: జిల్లాపరిషత్ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ



కొడంగల్ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో..

తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ. ఈ పర్వదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తుగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. అనంతరం తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు ఆట, పాటలతో ఉల్లాసంగా నృత్యాలు చేశారు.



తాండూరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



ధారూరు: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



పరిగి: సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



అనంతగిరి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంబురాలు



అనంతగిరి: వికారాబాద్‌లో..



బంట్వారం: మోడల్ స్కూల్లో బతుకమ్మ సంబరాలు

పింఛన్లు పెంచేవరకు పోరాటం

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్

కుల్కచర్ల: ఆసరా పింఛన్లు పెంచేంత వరకు పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శివాజీ, మొగులయ్య, భానుప్రకాశ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బురుజు తొలగించాలని..

గ్రామస్తుల వినతి



ఇళ్లమధ్య ఉన్న బురుజు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం గోట్లపల్లి గ్రామంలో ఇళ్ల మధ్య ఉన్న పురాతన బురుజు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే ఎప్పుడు కూలుతుందోనని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బురుజులో పెద్ద, పెద్ద బండరాళ్లు ఉండడంతో పాములు, విష పురుగులు తిరుగుతున్నాయని చెప్పారు. కావున సంబంధిత అధికారులు స్పందించి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సామాజిక సేవే స్వచ్ఛంద సంస్థ లక్ష్యం



సైకిళ్లు పంపిణీ చేసిన స్టేట్ స్ట్రీట్ సంస్థ సభ్యులు

స్టేట్ స్ట్రీట్ సభ్యులు

- విద్యార్థులకు సైకిళ్లు, బ్యాగుల పంపిణీ

దుద్యాల్: సామాజిక సేవే లక్ష్యమని స్టేట్ స్ట్రీట్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ. 1.38 లక్షల వ్యయంతో 25 మందికి సైకిళ్లు, రూ.30వేల విలువ గల బ్యాగులు, పాఠశాలకు రూ.78వేల విలువ చేసే క్రీడా వస్తువులు, రూ.80వేల నీటిని శుద్ధి చేసే వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి విజయ రామారావు, విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమన్నారు. స్టేట్ స్ట్రీట్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు శ్రావణ్, రాకేశ్, గీతు, శ్రీవాణి, వైశాలిలు మాట్లాడారు. కష్టపడి చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా సభ్యులు వైశాల్, జోగ రావు, కోటేశ్వర్ రావు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడికి సహకారం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని నాందార్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం హైదరాబాద్‌కు చెందిన యూత్‌ఫర్ సేవా ఆధ్వర్యంలో స్టేట్ స్ట్రీట్ కంపెనీ నుంచి 40బ్యాగులు, రూ.లక్షపైగా విలువ చేసే వాల్ పెయింటింగ్ పనులు చేయించారు. సంస్థవారిని, కంపెనీ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రామయ్య, స్టేట్ స్ట్రీట్ కంపెనీ శ్రీనిక్, యూత్ ఫర్ సేవా సంస్థ కోటేశ్వర్‌రావు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత ఆగమన్

చేవెళ్ల: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చేవెళ్లలో ప్రతిష్ఠించే దుర్గామాత అమ్మవారి విగ్రహాన్ని శనివారం రాత్రి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా దుర్గామాత ఆగమన శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. దుర్గామాత కమిటీ నిర్వాహకులు మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలంకరణలతో డప్పు, చప్పుళ్ల మధ్య అమ్మవారికి ఘనంగా స్వాగతం పలికారు. చేవెళ్లలోని రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో దుర్గామాత అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి.. నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రుణాల చెల్లింపునకు కృషి

మొయినాబాద్‌రూరల్: మండలంలో ఆయా మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సమయానికి బ్యాంకుల్లో చెల్లించేందుకు వీవోఏలు కృషి చేయాలని మండల మహిళా సమాఖ్య ఏపీఎం నర్సింలు అన్నారు. శనివారం మండల మహిళా సమాఖ్య భవనంలో వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరంలో తీసుకున్న రుణాలను చెల్లించేందుకు కృషి చేయాలన్నారు. దీంతో తిరిగి రుణాలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఆయా గ్రామాల్లోని వీవోఏలు తీసుకున్న రుణాలను చెల్లించే విధంగా చూడాలని సూచించారు.

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి



మహేంద్ర బహదూర్‌ను సన్మానిస్తున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్

దోమ: ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్ పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని కిష్టాపూర్ పాఠశాలలో గణితశాస్త్రం బోధించే మహేంద్రబహదూర్ ఇటీవలే జీహెచ్ఎంగా పదోన్నతి తీసుకొని బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా లాల్యానాయక్ ఆయనకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మెరుగైన విద్యా బోధనకు మహేంద్రబహదూర్ అనునిత్యం శ్రమించాడని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో పల్లెల అభివృద్ధి



చాకల్‌పల్లిలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని చౌడాపూర్ మండల నాయకులు శేఖర్, రాజు నాయక్, చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం చాకల్‌పల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతీ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి ప్రత్యేక ప్రణాళికతో ముందుకుసాగుతున్నారన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, విజయ్, బాలరాజు, టీ.రాములు, రఘు, హర్యనాయక్, కృష్ణయ్య, బొక్క రాములు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

హెచ్ఎం వినోద్‌కుమార్



కోత్లాపూర్ పాఠశాలలో విద్యార్థులకు టీషర్టులు పంపిణీ చేస్తున్న హెచ్ఎం వినోద్‌కుమార్

తాండూరు రూరల్: చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తోందని కోత్లాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జొన్నల వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో 62 మందికి సొంత డబ్బులు వెచ్చించి టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ బుక్స్, పెన్నులు, కలర్ పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారద, శ్వేత, వజ్రమాల, జొన్నల శివజ్యోతి, గ్రామస్తులు సాయిలు, నవీన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, గోపాల్ నాగమ్మ, బాలమణి, కృష్ణవేణి, భాగ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన అవసరం



మంబాపూర్‌లో పారిశుద్ధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ ప్రవీణ్‌కుమార్

డీఎల్‌పీఓ ప్రవీణ్‌కుమార్

తాండూరు రూరల్: పారిశుద్ధ్యంపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డీఎల్‌పీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పెద్దేముల్ మండలం మంబాపూర్ పాఠశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. వ్యాధులు దరిచేరకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రతను పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మానవ హారం నిర్వహించి పారిశుద్ధ్యంపై ప్రతిజ్ఞ చేయించారు. అక్టోబర్ 2వ తేదీ వరకు గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రతన్‌సింగ్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ అనంతగిరికి పాటుపడుదాం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్ రెడ్డి



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న ప్రతినిధులతో సదానంద్‌రెడ్డి



పరిగి: బహుమతులు ప్రదానం చేస్తున్న అనసూయ

అనంతగిరి: స్వచ్ఛ అనంతగిరికి ప్రతిఒక్కరూ పాటుపడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్ రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. అక్షర ఫౌండేషన్, రాణి రుద్రమదేవి, యజ్ఞ ఫౌండేషన్, వికారాబాద్ ఐటీ ఉద్యోగుల సంఘం ఉద్యోగులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా బండ బావి ప్రాంతాన్ని శుభ్రం చేశారు. అనంతరం సదానంద్ రెడ్డి మాట్లాడుతూ, ప్లాస్టిక్ నివారణ బాధ్యతగా భావించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించకపోతే భూమి పొరలోచేరి నీరు ఇంకి పోకుండా చేస్తుందన్నారు. అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పౌండేషన్ల నిర్వాహకులు స్వాతి, డాక్టర్ ఉజ్వల్, బీజేపీ నాయకులు అమరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు శివరాజ్ గౌడ్, బస్వలింగం, రఘు, సుధాకర్, మల్లేశం, శ్రీనివాస్, ఐటీ ఉద్యోగులు శ్రీకాంత్ రెడ్డి, హేమంత్, పద్మనాభం, దినేశ్, సంతోశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు ..

తాండూరు టౌన్: నరేంద్ర మోదీ జన్మదిన సేవా పక్షం కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం పట్టణంలోని ఓపెన్ జిమ్‌పార్క్ వద్ద 12వ వార్డు మాజీ కౌన్సిలర్ పూజ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశ ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్, నాయకులు సుభాన్ రెడ్డి, నారాయణ, సాహు శ్రీలత, రజినీకాంత్, మల్లేశం, కృష్ణ, ప్రహ్లాద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి

పరిగి: విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని బీజేపీ మండల అధ్యక్షురాలు నీరటి అనసూయ సూచించారు. శనివారం మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, ఓటమి గెలుపునకు నాంది అన్నారు. లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలయ్య, రామాజంనేయులు, తదితరులు పాల్గొన్నారు.

యాలాల: భారత ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా 15 రోజుల పాటు బీజేపీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు ఆకుల శివకుమార్ అన్నారు. శనివారం మండలంలోని కోకట్ గ్రామంలో ఎంపీ నిధుల నుంచి కొత్త బోరును వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..నీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా గ్రామాల్లో బోర్లు వేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ, బీజేపీ జిల్లా ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర్‌గుప్తా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. యాలాల, బాణాపూర్, ఎన్కేపల్లి గ్రామాల్లో కొత్తగా బోర్లను వేయించామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, బజారప్ప, రాజేందర్‌రెడ్డి, రమ్యానాయక్, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, వడ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.